# చంచల

"నాన్నా! చిట్టి తండ్రీ!

ఇన్నాళ్ళబట్టీ ఉత్తరం వ్రాయలేకపోయినా, ఈ వూరొచ్చిన మూడు రోజులకే నీకింత పెద్ద ఉత్తరం వ్రాయవల్సి వస్తుందని నేనూ అనుకోలేదురా పిచ్చి కన్నా!... ఇంతకీ ఒక్క మాటలో దానికి కారణం చెప్పాలంటే— 'చంచల'!...నేను అతి గాఢంగా ప్రేమించిన చంచల!

ఆ కథావిధానం బెట్టిదన...

మా కంపెనీ ఒక విదేశీ కంపెనీ సహాయంతో ప్రస్తుతపు మా వ్యాపారాన్ని అభివృద్ధిచేయ నిశ్చయించుకుంది. ఆమాట అనుకొని వూరుకుంటే ఇంత గొడవా జరిగి ఉండేది కాదు...నేను చంచలను ప్రేమించేవాడినీ గాదు!...

మా క్రొత్త ఫ్యాక్టరీని నేనిప్పుడు కూర్చొని ఉత్తరం వ్రాస్తున్న ఈ వూళ్ళో కట్టాలని నిర్ణయించుకున్నారు... నిర్ణయించుకున్నారుబో... మొదట్లో ఆ నేల సర్వేచేసి, దానిని చదునుచేయించి, చుట్టూ ముళ్ళతీగె వేయించేందుకుగాను ఆ కంపెనీలో రెండు సంవత్సరాల క్రితం చేరిన ఈ ఇంజనీరుగాణ్ణి 'పోయిరా' తండ్రీ అని పంపాలా?...

సరే!...మొన్న ఉదయం ఎనిమిది గంటల పాసింజర్లో బయల్దేరాను—పెట్టె, బెడ్డింగుతో! (ఈ వూళ్ళో

ఎక్స్‌ప్రెస్‌లు ఆగవట!) బండి సరిగ్గా ఏడిస్తే మిట్టమధ్యాహ్నం రెండు గంటలకు ఈ వూరి స్టేషన్‌లో దిగవల్సి ఉంటుంది. అక్కడినుండి రెండుమైళ్లు కాలినడక...అంటే ఒక ముప్పావు గంట కలుపుకో...షుమారుగా వూళ్ళోకి మూడు గంటలకు జేరగలుగుతా నన్నమాట! ఒక మిత్రుడి సలహామీద ఈ వూరి కరణంగారికి నేను 'భలానా' అని, 'భలానా' పనిమీద వస్తున్నానని, నాకో కొంప చూచి తాళంవేసి అట్టే పెట్టమని ప్రాధేయపడుతూ జాబు వ్రాసుకున్నాను ముందుగానే...ఆ మహానుభావుడు నాయందు దయఉంచి, 'అలా చేసినట్టుగా' కూడా ఒక కార్డుముక్క వ్రాసి పారేశాడు...వూరి మొదట్లో పెద్ద బంగళా ఖాళీగా ఉన్నదట!

ఇంకేం! చాలా సంతోషించాను...అక్కడికి వెళ్ళి ఆఫీసుకు వసతి వెతికేపని ఒకటి తప్పిందన్నమాట! అది నా వసతికే గాకుండా ఆఫీసుకు కూడా సరిపోవచ్చనుకున్నాను... నేను వెళ్ళి ఆఫీసు వోపెన్ చేస్తే చిన్నగా జూనియర్ ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, మేస్త్రీలు వచ్చి జేరతారు. మా కంపెనీ మేనేజర్‌కు కూడా ఈ విషయం చెప్పాను. ఆయన 'చూచి బాగుంటే టెలిగ్రాం ఇవ' మన్నారు. ఆఫీసు ఫర్నిచర్, సర్వేకు కావాల్సిన పరికరాలు, రికార్డులు మొదలయినవన్నీ పంపిస్తానన్నాడు.

నాతోపాటే అక్కడే పనిచేస్తున్న 'జాకోబ్'ని కూడా పంపేందుకు నిర్ణయించింది కంపెనీ. బండి ఇంకో

గంటలో బయల్దేరుతుంది అనేంతవరకు వాడు వస్తాడనే అనుకుంటున్న నన్ను, అకస్మాత్తుగా వచ్చి, "మా ఆవిడకు కాల్లో ముల్లు విరిగింది" లాంటి వంకతో, ఆరోజు రాలేనని, మర్నాడు ఉదయానే బయల్దేరి వస్తానని, క్షమించమని, ఆఫీసుకు రిపోర్టు చేయవద్దనీ బ్రతిమలాడసాగాడు. వాడి మొఖం చూస్తే జాలివేసి, 'సరే'నని నే నొక్కణ్ణే బయల్దేరాను. వీడురాడని ముందే తెలిస్తే ఆ కరణంగారికే, పెట్టి, బెడ్డింగ్ మోసుకొచ్చేందుకుగాను స్టేషన్‌కు మనిషిని పంపమని వ్రాసుకొని ఉండేవాడిని!

సరే!...స్టేషన్లో మనిషి దొరక్కపోతాడా అని ధైర్యంతో బయల్దేరాను.

మనం అనుకున్నట్లు అన్నీ జరగవ్ కదా... నే నెక్కిన రైలుబండి ఆ దారిలోనే మరో గూడ్సుబండి పట్టాలు తప్పగా ఆరు గంటల ఆలస్యంతో రాత్రి ఎనిమిది గంటలకు ఆ వూరి స్టేషన్లో ఆగింది-బిక్కు బిక్కుమంటూ' కీచురాళ్ళ మోత మధ్యన ఉన్న ఒక రేకుల షెడ్డు ముందు దిగాను నేను పెట్టె, బెడ్డింగ్ పట్టుకొని.

ఆగినంతసేపు పట్టలేదు తిరిగి బండి వెళ్ళటానికి. బండి వెళ్ళిన మరుక్షణంలో చూచుకుంటే ప్లాట్‌ఫారం మీద నే నొక్కణ్ణే మిగిలాను... చేతిలో పెట్టె, బెడ్డింగు. వాటిని క్రింద పెట్టేసి నా దురదృష్టానికి (బండి ఆలస్యంగా వచ్చినందుకు) నిట్టూరుస్తూ ఏం తోచక అయోమయంగా

నిలబడిపోయాను. అయితే పిండారబోసినట్లున్న వెన్నెల కాస్తంత ధైర్యం చేకూరుస్తున్నది!

తరువాత రెండు మూడు నిముషాలకు పీలగా, పొడుగ్గా ఉన్న వ్యక్తి రేగిన జుట్టును సరిచేసుకుంటూ వచ్చి నా ముందు నిలబడటంతో ఏదో పోయిన వస్తువు దొరికి నట్లే అనిపించింది.

నేను వెళ్లవల్సిన ప్రదేశానికి దారి వగైరాలు అడుగు దామనే సత్సంకల్పంతో నోరు తెరవబోయేలోగానే ఆయనే ఒక చిరునవ్వు పారేసి, "మీరు ఈ రైల్లో దిగారా?" అని అడిగాడు.

"అవును!"

"అయితే మీ టిక్కెట్టు ఇలా యిస్తారా?"

"మీరు...?"

"నేను ఈ స్టేషన్ మాస్టర్ని!"

ఆపద్బాంధవుడిలా కనబడిన ఆయన గృహంలో నాపెట్టె బెడ్డింగ్ పెట్టి ముందుకు వెన్నెల్లోకి చీల్చుకు పోతు న్నట్లుగా అడుగులు వేశాను - అది తప్ప నాకు మరోదారి లేదు!

ఆయనే మర్నాడుదయం నాపెట్టెబెడ్డింగ్ కూలీకిచ్చి కరణం గారింటికి పంపుతానన్నాడు.

అనుకోకుండా ఏర్పడిన ఈ ఉపద్రవం నాకు కాస్త చికాకు కలిగించింది. అటు లేటుగా వచ్చిన రైలుబండి

మీద, రాని జాకోబ్ మీదగూడా కోపమొచ్చింది. కాని చేయగలిగిందేం వుంది...కాదంటే కాళ్ళను నేలకు కొడుతూ నడవటంతప్ప!

'కష్టాలల్లో పుట్టినవాడు తరువాత ఎన్నడో సుఖ స్తాడు' అన్నట్లు ఇన్ని ఇబ్బందులతో బయల్దేరాను కాబట్టి ఈ కంపెనీ ప్రారంభంతో మనకో మంచి ప్రమోషన్ దొరక్కపోతుందా అనే ఆశగూడా మనస్సులో మొల కెత్తింది-అదెలా వున్నా రాత్రికిరాత్రే చంచలను ప్రాణ సమానంగా ప్రేమించాననేది మాత్రం ఖాయం!

వెన్నెల పిండారబోసినట్లున్నదని ఇందాకే వ్రాశాను గదా!...బాటకు రెండుప్రక్కలా సర్వితోపులు కోటగోడల్లా వరసగా అందంగా వున్నయి. వాటి వెనుకగా గజిబిజిగా వికృతంగా ఏవేవో చెట్లు...వాటి నడుమనుంచి వింతవింత పక్షుల కూతలు...

ఎంత వెన్నెలున్నా కాస్త వెన్నులోంచి భయం చలిలా పుట్టుకొస్తున్న మాట నిజమే! ఎనిమిదిన్నర గంటల తరువాత నరసంచారంలేని ఆ కొత్తబాటలో నడవాలంటె నాకేగాదు ఎవరికైనా అలాగే వుంటుందని మనస్సుకు నచ్చచెప్పుకోవటం తప్ప చేసేదేముంది. (నాగురించి నన్ను తక్కువగా ఊహించుకోవటం చాలాతప్పు గనుక - ఎవరో అన్నట్లు!)

అందునా ఒకటి రెండుసార్లు నావెనుగ్గా ఎవరో నడు స్తున్నట్లు ఊహించుకొని ఉలిక్కిపడి వెనుదిరిగి సర్విచెట్ల

నీడలను చూచి నవ్వుకొని ముందుకు అడుగులు వేసేవాణ్ణి... ఒక అందుకు నాలో నేను ఎంతగానో సంతోషించాను... ఆ నీలాంటి పీల స్టేషన్ మాస్టరు ధర్మమా అని పెట్టె బెడ్డింగ్ మోసే బెడదొకటి ఆసమయంలో తప్పినందుకు!

పదు హేను నిముషాలకే ఆ చెట్ల మధ్యనుండి ఊళ్ళో దీపాలు లీలగా కనబడినయి... ఫరవాలేదు స్టేషన్‌కు దూరంగావున్నా కరెంటు దీపాలు ఉన్నందుకు సంతోషించాను... లేకపోతే ఈ జాకోబ్ గాడు వచ్చేటంతవరకు కిరసనాయిల్ లాంతర్లు గూడా తుడవాల్సిన అవసరం ఏర్పడినా ఏర్పడవచ్చు ..అసలు వాణ్ణి నేను ఈ రెండేళ్ళబట్టీ కనిపెడుతూనే వున్నాను. వట్టి దొంగవెధవ...పని ఎగగొట్టటంలో 'ఫస్టు' వాడే!

దీపాలు చూసేటప్పటికి...ఇందాకే చెప్పానే.... వెన్నులోంచి ఏదోలాంటి భయంవస్తోందని···అదికూడా దూరమయింది···అడుగులు ఉత్సాహంగా పడినయి. పొద్దుననగా అదేదో స్టేషన్లో ఉడికీ ఉడకని నాలుగు మెతుకులు కొరికానేమో కడుపు ఆవురావురు మంటోంది. ముక్కు మొఖం తెలియకపోయినా ఇంతదూరంనుండి పొద్దుబోయి వచ్చిన నాకు ఆ కరణం నాలుగు మెతుకులువేయడా అనే ఆశ మనస్సులో మొదలుతోంది······

కాని మన్ని అదృష్టం మరో వైపునుండి పగ్గాలేసి లాగుతుంటే ఆకరణంతో నాకేం పని······

చంచల...తప్పు తప్పు...కథలు వ్రాసే అలవాటున్న నేను కూడా అంత సూటిగా చెప్పటమూ...కొద్దిగా వోపిక పట్టరా పిచ్చితండ్రీ...

వెన్నెల ఉందన్నానుగదూ...సర్వీతోపులు కూడా ఉన్నాయూ...అట్లా ఆ దారి ఒక మలుపు తిరిగి, వో చిన్న కాలువ మీా దేసిన కర్రవంతెన కాస్తా దాటేటప్పటికి వూరు పూర్తిగా స్పష్టంగా కనబడింది. అందునా వూరికి ఓ ఫర్లాంగు ఇవతెలగావున్న ఒక బంగళా నన్ను ఇట్టే ఆకట్టేసింది! 'ఎంత బాగుంది?' అనుకున్న క్షణానికి ఆ వూరి కరణంగారు నాకోసరం నిర్ణయించిన బంగళా ఇదేనేమో అనే అనుమానం కూడా మొలకెత్తి చిన్న చిన్నగా గారడీవాడి మామిడి చెట్టులా పెరిగిపోసాగింది. చిట్ట చివరకి ఆ లైట్లు, బంగళా, దాని చుట్టూవున్న తోట చూస్తుంటే 'అదే నాకు నిర్ణయించిన బంగళా' అనే నిర్ణయించుకొని కరణం గారు చేసిన సహాయానికి మనస్సులో ధన్యవాదాలు కూడా అర్పించేశాను...

ఇంకాస్త ముందుకు వచ్చేటప్పటికి ఆ ఇంటి ప్రహారీ గోడ దాపుకొచ్చేసింది. ఆ తరువాత పదడుగులు వేసానో లేదో పెద్ద గేటు, గేటు ముందు 'నమస్కారమంటూ' ఓ వ్యక్తి ప్రత్యక్షం...

"నమస్కారం!" కరణం మనిషిగాదు గదా?

"బండి ఆలస్యంగా వచ్చిందా బాబూ?".

"అవును!" ఠీవిగా అన్నాను.

"దయచేయండి!...బాబుగారు మీకోసరమే ఎదురు చూస్తున్నారు!"

"బాబుగారంటే?" సంశయిస్తూనే అడిగాను.

"అదే...రఘునందనం బాబుగారు!"

అంటే కరణంగారు కాదన్నమాట...ఈ ఇంటి యజమాని అయివుండవచ్చు!

ఉల్లాసంగా, తనివితీరా బంగళా ముందున్న తోటను చూస్తూ అడుగులు ముందుకు వేశాను.

బయట గేటుకు, వరండాకు మధ్య సుమారు ఐదారు వందల గజాల దూరం ఉంటుంది. అసలు ఆ బంగళా ఆకారాన్ని చూస్తుంటే ఒక నిర్ణయం ప్రకారం కట్టినట్లున్నది. రేపొద్దున జనరల్ మేనేజర్‌కు టెలిగ్రాం ఇస్తేసరి!...ఒక పని చాలా సులువుగా అయిపోయింది.

పాలరాతి గచ్చుమీద శబ్దం చేయకుండా అడుగులు వేస్తున్నయి నా బూట్లు!

గేటు వద్దనుండి నన్ను అనుసరించిన ఆ వ్యక్తి, దగ్గరకు వేసివున్న తలుపును నెట్టి లోపలికి చూస్తూ, "బాబుగారు వచ్చారు!" అన్నాడు.

నాకు ఆ పెద్ద హాలును చూచేటప్పటికి కళ్లు జిగేలుమన్నాయి.

అది జమీందారుల గృహం కాదుగదా అనిపిం

చింది!—అటువంటి గృహంలో కాలు పెట్టటానికి కాస్త కాళ్లు గూడా తడబడిన మాట వాస్తవమే!

"రండి!...రండి!..." అన్నారు, ఆయన లేచి నిలబడి సాదరంగా ఆహ్వానిస్తూ.

అంత అంతస్తులో ఉన్న వ్యక్తి ఒక సాధారణ ఇంజనీరునైన నన్ను అలా ఆహ్వానించటం నాకే గర్వకారణమైంది.

చిరునవ్వుతో "నమస్కారమండీ!" అన్నాను.

"నమస్కారం బాబు! బండి ఆలస్యంగా వచ్చిందా?.. ఇదుగో ఈ రైళ్లతో వచ్చిన చిక్కే ఇదయ్యా!" అన్నారు ఆయన నవ్వి.

ఆ నవ్వులో ఆయన వెడల్పైన ముఖం మరింత విశాలమయింది. గోల్డు ఫ్రేమ్ కళ్లజోడు తళుక్కున మెరిసింది. వత్తైన తెల్లని జుట్టు వింతగా నిక్కబొడుచుకుంది.

నేను లోపలికి అడుగులు వేశాను.

ఆయన సోఫా చూపిస్తూ "కూర్చో!" అన్నారు.

కూర్చొని తలెత్తి మెరిసిపోయే ఆ బంగళాను మరోసారి వింతగా చూచాను.

"కరణంగారు వ్రాశారు...నేను చాలా..."

"ఇదుగో మీ కుర్రవాళ్లతో వచ్చిన చిక్కే ఇది... పొద్దున లేచినప్పటినుండి ప్రతి వాళ్లతోటీ వ్యాపార సరళిలో మాట్లాడటమే తప్ప ఒక మంచీ మర్యాదలేదు...

పొద్దుననగా బయల్దేరావ్...ఎండల్లా మొఖాన కొట్టుకొని ఇప్పటికి గమ్యం చేరావ్...కాళ్ళు కడుక్కో...కాసిని మంచి నీళ్లు త్రాగు...డొక్క ఏడుస్తుండాలి...కడుపు నింపుకో...తరువాత అవన్నీ నావకాశంగా మాట్లాడుకో వచ్చు!'' అని పెళ్ళున నవ్వి, క్షణంలో ఆపేసి తడబడుతూ, ''అరెరె! ఎంత పని జరిగిపోయింది...నీ వొచ్చి ఇంత సేపయిందా!...మా అమ్మాయిని నీకు పరిచయం చేయనేలేదు గదూ?...నాది ఒట్టి మందబుద్ధని అది తిడుతూనే ఉంటుంది...కాని ఏం లాభం?...ఒక్క క్షణంలో పిలుస్తానుండు...ఇట్టే వస్తుంది...ముందు పరిచయం తరువాతే నీవు మంచినీళ్ళు త్రాగటం గూడా ఆఁ ..'' అని ఆయన వాక్ప్రవాహానికి చిన్న ఆనకట్టవేసి, ''చంచలా! చంచలా!'' అని పెద్దగా పిల్చారు.

నేను ఆయనను ఆయన మాటలను వింతగా జూస్తూ ఆలాగే కూర్చుండిపోయాను.

''ఓ చంచలా! త్వరగా రావాలి...''

చల్లని పిల్లవాయువులు గదిని చుట్టుముట్టుతున్నాయి. తోటలోని సంపెంగల సువాసన వాయువుతో మిళితమై తలను మత్తెక్కిస్తోంది. ఎక్కడో మృదువైన అడుగుల సవ్వడి...కోకిల కంఠంతో సన్నని ఆలాపన...

నోరు తెరుచుకొని ఆలాగే లోపల గది కర్టెన్ వంక చూస్తూ కూర్చున్నాను.

మృదువైన ఎర్రని సన్నని వేళ్ళు కర్టెన్ను ప్రక్కకు తొలగించినయ్.

మరుక్షణంలోనే ఒక అపరంజి బొమ్మ తళుక్కున మెరిసింది!

నేను ఆమెను చూస్తూనే కొయ్యబారిపోయాను.

ఆమె మానవ స్వరూపిణా లేక దేవతా స్త్రీనా?

తెల్లని చీరె, తెల్లని జాకెట్టు, నల్లని ఒత్తైన కురులతో అందానికి ప్రతిబింబంలా, అజంతా శిల్పంలా...ఆమె ...ఆమె,..ఆ చంచలను చూస్తుంటే నా కళ్లు తిరిగినయ్.

"వారు రానే వచ్చారు...నీకు పరిచయం చేద్దామని పిలిచాను...ఈలా రా!" అన్నారు.

ఆమె అడుగులు, ఎక్కడ పడిపోతానో అన్నంత సుతి మెత్తనగా వేసి నా ఎదురుగా నిలబడింది. ఆ హాలు మధ్యగా నిలబడ్డ ఆమె మెర్క్యురీ బలుబులా తళుక్కుమంటోంది.

"మా అమ్మాయి...చంచల!" అన్నారు నావైపు తిరిగి.

"నమస్కారం!" అన్నాను. నాకు తెలియకుండానే నా నోరు పలికింది. చేతులు కలిసినయ్.

"నమస్కారం!" వీణ మీటింది.

"వీరినిగురించి నీకు చెప్పనక్కరలేదు గదా?"

ఆమె సన్నని నవ్వుకు ఆ గదిలో వెన్నెల కురిసింది!

"ముందు చల్లటి నీళ్లు పంపు...గొంతు తడార్చు కొని పావుగంట విశ్రాంతి తీసుకున్న తరువాత స్నానానికి నీళ్లతోడి కబురంపు...ఈలోగా కాస్త మేము మాట్లాడు కుంటుంటాం!"

"సరే!" అన్నది వెనుదిరుగుతూ.

ఆమె ఆ గదిలోంచి దాటి వెళ్ళినా నేను వాకిలి వైపే సభ్యతను గూడా మర్చిపోయి చూస్తుండిపోయాను.

తరువాత ఐదు నిముషాలకు ఆ ముసలాయన నన్నే మైనా అపార్థం చేసుకుంటాడేమోనని వూహా మెదిలి తల వంచుకునేటప్పటికి ఆ అపరంజిబొమ్మను గురించి ఆయన ఎత్తనే ఎత్తారు!

"చంచల ఉంది చూచారా! అందానికి ప్రతిబింబం అనుకో...అంతేగాదు సుగుణాల రాశిగూడా!..." అని ఒక్కక్షణం నా మొఖంలోకి ఆత్రంగా చూచి "మా అమ్మాయి అని నేను గొప్పకు చెప్పుకుంటున్నాను అను కునేవ్...నిజం! అది అక్షరాల నిజం...దానిదంతా దాని తల్లి పోలికే!" అని ఒక్క నిట్టూర్పు విడిచారు.

ఆయన మొఖం క్షణంలో నల్లబడిపోయింది. తల వాల్చుకున్నారు. చిటికిన వ్రేలితో కళ్ళక్రింద రాచు కోవటంతో బహుశ కన్నీరు గూడా తుడుచుకుంటున్నా రేమోననిపించింది నాకు.

"ఇదుగో...చూడు...ఇంతకీ మర్చిపోయాను. మతి

మరుపులో నన్ను మించినవాడు లేనే లేడు..,ఆ...నీ పేరూ అడగనే లేదుగదూ ?"

నా పేరు చెప్పాను.

"శేషగిరీ! ఒక్కమాట చెప్పు నాకు...నా భార్యది నాది ఒక్క కులం కాకపోవచ్చు...మేమిద్దరం పెద్దవాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకోనూవచ్చు!... అంతమాత్రాన ఆ కసంతా చంచలమీద ఎందుకు తీర్చుకోవాలి ?"

నేను అదిరిపడ్డాను...చంచల...చంచలమీద ఎవరికైనా కసా ?

"ఏంవైంది ?" అన్నాను ఆత్రంగా.

"ఏమవుతుంది ?...నాతో బాటే నా చంచలను గూడా బహిష్కరించారు నా వాళ్ళంతా. అంతకంటే చేయగలిగింది మాత్రం ఏవుంది వాళ్ళు!" ఒక నిశ్వాసం విడిచారు ఆయన.

నాకు ఆయన ధోరణి పూర్తిగా అర్థంకాకపోయినా, అది నన్నంత గాయ పరిచేది కాక పోవటంతో 'వూ' కొట్టి వూరుకున్నాను.

"పోవయ్యా! ఇవాళ నా చంచలకు పెండ్లి కాకుండా అయితే చెయ్యగలిగారు...ఇంత దూరం వచ్చానా ?... ఇక్కడైనా పెండ్లి కాకుండా ఎట్లా అడ్డు పడతారో చూస్తాను...ఏవనుకున్నారో వెధవలు...వాండ్ల సంసారాలు

కోనెయ్యగల తాహతుంది నాకు!...ఆ...'' అని ఒక్క క్షణం ఆగి, "నీవు చెప్పు శేషగిరీ! మా చంచలను పెండ్లి చేసుకునేందుకు ముందు కెవడూ రాడంటావా?'' అన్నారు.

అలాంటి ప్రశ్న వస్తుందని నేననుకోలేదు.

కాస్త ఉక్కిరి బిక్కిరి అయిన మాట వాస్తవమే గాని, తొందరపాటును నిగ్రహించుకొని, "అదేంమాట... అసలు వచ్చినవాడు వెనక్కు వెళతాడా?'' అన్నాను హుషారుగా. అనుకోకుండా ఆ మాటలు అలా వెలువడినయి.

"అలా అన్నావ్ బాగుంది!...నిజమైన మాట చెప్పావు. .నేనూ అదే అంటాను అమ్మాయితో...అయినా ఒక్కటి చెబుతాను మనస్సులో పెట్టుకో...దానికున్న గుండె ధైర్యం నాకు కూడా లేదనుకో!''

ఇంతలోనే లోపలినుండి పని మనిషి వచ్చింది. "నీళ్ళు తోడాను బాబూ!'' అంటూ.

లేచి స్నానం చేసి, గుడ్డలు మార్చుకొని భోజనాల ముందు కూర్చొనేటప్పటికి తరువాత అరగంట పట్టింది.

ఈ అరగంటా నేను చేస్తున్న పనులమీదకంటే, ఆమె అందమైన కళ్ళ కోసరమే నా కళ్ళు ఆత్రంగా వీక్షిస్తున్నాయి.

నేను వచ్చేటప్పటికి భోజనాల హాల్లో టేబుల్ మీద అన్నీ అమర్చి ఉన్నాయి. రఘునందనంగారు నన్ను

చూస్తూనే లేచివచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. అటు చంచల వచ్చి నా ఎదురుగ్గా కూర్చున్నది.

ఆమెను చూస్తుంటే...ఆమె కళ్ళను చూస్తూంటే ఎప్పటినుండో తిండికోసరం తహతహలాడుతున్న నేను ఆకలిని కూడా మర్చిపోయాను...ఎంత కాలమైనా నిద్రాహారాలు మాని ఆ కళ్ళను చూస్తూ కూర్చోగలను...చంచల కళ్ళలో ఒలికే అమృతమే నాకు అన్న పానీయాలు!

"ఈ రోజున వంటంతా స్వయాన చంచల చేసింది. అసలెవరైనా అతిధులు వస్తే ముందు చంచలే వంట ఇంట్లో కూర్చుంటుంది...!" అన్నారు నవ్వి రఘునందనంగారు.

"ఫో నాన్నా! నువ్వు మరీను...!"

చూశావా! శేషగిరీ!...స్త్రీకి సిగ్గే సింగారమన్నారు ...ఇప్పుడు చూడు మా చంచలను!" ఆయన కళ్ళు గర్వంతో మెరిసి పోతున్నాయి.

చంచల సిగ్గుతో మరింత ఎర్రబడింది.

"అసలు సిగ్గుకు చంచలే అందం తెస్తున్నదని చెప్పాలి!" హుషారుగా ముందుకు జరిగి అన్నాను.

"ఇదుగో ఇద్దరూ ఒకళ్ళ కొకళ్ళు వంతపాడుకుంటూ కూర్చుంటే నేను కంచంముందునుండి లేచిపోయేది ఖాయం!"

"అబ్బెబ్బే! ఆ పని మాత్రం చేయబోకు...ఇక

చూసుకో మీ నాన్నంటే ఎంత బుద్ధిమంతుడో నిరూపిస్తాను...అయ్యో శేషగిరిగారూ!...నా నోటికి మా చంచల తాళం బిగించింది...కాస్త మీరు కూడా కట్టడిలో ఉండక పోతే మీకూ ఏదో శిక్ష విధించిందన్నమాటే!'' అని ఫక్కున నవ్వి దబదబా అన్నం కలుపుకొని తినసాగారు తలవంచుకొని.

క్షణం సంశయించినా ధైర్యం చేసి అన్నాను... ''చంచల విధించే శిక్షను స్వీకరించేందుకు తయారుగా ఉన్నాను...అందుకు భయపడి నేను చెప్ప దలుచుకున్నది మాత్రం చెప్పకుండా ఫూరుకో లేను!''

క్షణక్షణానికి చంచల నాకు దగ్గరవుతున్న దేమో ననిపించింది...ఆమెమీద తెలియని అధికారం కూడా నాలో కూడు కట్టుకుంటున్న దేమో ననిపించింది.

''అయితే తింటున్న అన్నం వదిలేసి వెళ్ళిపోవాలను కుంటున్నారా నేను!'' అన్నది తలెత్తి సూటిగా చూస్తూ.

సమాధానం చెబితే ఎక్కడ చూపు మార్చు కుంటుందోనని కొన్ని క్షణాలవరకు నేను సమాధానం చెప్ప కుండా అలా ఆమె కళ్ళల్లోకి చూస్తూనే ఉండిపోయాను.

నన్ను ఏదో తెలియని శక్తి చుట్టు ముట్టింది. బాహ్య జ్ఞానాన్ని మర్చిపోగా ఈ ప్రపంచంలో ఒక్క చంచల ముఖమే నాకు దృష్టిపథంలో కనబడుతోంది. కన్నార్ప లేకపోయాను. చూపు మార్చుకో లేకపోయాను ...ఆమె కళ్ళను చూస్తూ అలాగే కూర్చుండిపోయాను.

"అదేంవిటి? అడిగిన దానికి సమాధానం చెప్ప కుండా కొయ్యబొమ్మలా కూర్చుండిపోయారు!"

"చంచల!" గొణిగాను. "లేదు చంచలా! నేను అశక్తుణ్ణి...నేను నీకు సమాధానం చెప్పలేను...నీవే శిక్ష విధించినా అనుభవించేందుకు సంసిద్ధుణ్ణి!"

"సరే! మీరేం చెబుతున్నారో మీకే అర్థం గావటం లేదల్లే ఉన్నది...ముందు భోంచేయండి. తరువాత తీరికగా చెబుదురుగాని!" ఫక్కున నవ్వింది.

నేను స్మృతిలోకొచ్చి సిగ్గుపడ్డాను. తలెత్తి పక్కకు చూస్తే ఉలిక్కిపడ్డంత పనయింది.

రఘునందనంగారు అక్కడలేరు!

"నాన్నగారు...?..."

నా ప్రశ్న సగంలోనే ఉండగానే "లేచి వెళ్ళి అరగంటయింది!" మరోసారి నవ్వులు కుమ్మరించింది.

ఆతృతతో చేతి గడియారం చూచుకున్నాను. నేను భోజనానికి కూర్చుని అప్పటికి ముప్పావుగంట అయింది.

నాతల సిగ్గుతో కృంగిపోయింది. రఘునందనంగారి దృష్టిలో నన్ను నేను హీనపరుచుకోవటానికి అంతకంటే జరగవల్సిందేమి ఉన్నది...తలవంచుకొని గబగబా తినేసి టవల్‌తో చేతులు తుడుచుకుంటూ హాల్లోకి వచ్చేశాను.

"చాలా రోజుల తరువాత ఈరోజున నేను చంచల ముఖంలో నవ్వును చూచాను శేషగిరీ! నేను, అదృష్ట

వంతుణ్ణి!... ప్రతివారు మనస్సు ఇచ్చి మాట్లాడలేరు! నిజంగా ఈ రోజు నాకు సుదినం!"

ఉలిక్కిపడి పక్కకు తల తిప్పాను.

అద్దం ముందు నిలబడి వక్క పలుకు నములుతున్న రఘునందనంగారు కనబడ్డారు.

"అమ్మా! చంచలా!... శేషగిరికి తమలపాకు లివ్వు!"

మరుక్షణంలోనే చంచల ప్రత్యక్షమయింది— చేతులో ఆకులు మొదలయిన సామగ్రితో నిండిన వెండి పళ్లెంతో!

ఆమెను చూస్తూనే చిరునవ్వు నవ్వాను. సమాధానంగా నవ్వింది. ఆ నవ్వు నాలో తెలియని ఉత్సాహాన్ని బలాన్ని కలిగించింది. నన్ను ఆ గృహంలో అత్యున్నత స్థానంలో ఉంచింది!

"అసలు ఆ స్థానం నాదేనా?" ఒక్కక్షణం అమాయకపు ప్రశ్న—మరు క్షణంలోనే "ఆ ఉన్నత స్థానానికి నేను తగుదునా?" అని నన్ను సవాలు చేస్తూ ఇంకో ప్రశ్న!

ఏమని చెప్పగలనురా బాబు?

నన్ను నేను మరిచిపోయాను. అక్కడ ఉన్నది...ఆ చంచల ముందు ఉన్నది ... ఈ శేషగిరిగాదు...ఎవరో ... ఏ లోకానికి చెందినవాడో గూడా తెలియని వ్యక్తి...నిజం చంచల—అసలు ఆమె కళ్లు అలాంటివిరా ... కళ్ళుగాదు బాబు...అవి అయస్కాంతాలు!

రఘునందనంగారు చిన్నగా దగ్గారు.

ఆయన దగ్గుకు నేను ఉలిక్కి పడ్డమాట వాస్తవమే. అంతేకాదు తత్తర పడ్డాను గూడా...తల వంచుకొని వచ్చి తప్పు చేసిన వాడిలా ఆయన ముందు కూర్చున్నాను.

"అమ్మా! చంచలా!... శేషగిరికి నిద్ర వస్తున్న దల్లే ఉన్నది...అందునా పగలంతా రైలు ప్రయాణమయ్యే... వెళ్ళి అతని గదిలో పక్క వేయించరాదా?" అన్నారు.

"పక్క ఇదివరకే వేయించాను!" అన్నది నా వంక చూచి చిన్నగా నవ్వి.

నాలోని సంతోషం నా మొఖంమీది నవ్వుకు హేతు వయింది.

నేను లేచి నిలబడ్డాను.

నా అంతరంగాన్ని గుర్తించి రఘునందనంగారు గూడా నిలబడి నా కోసరం కేటాయించిన గదివైపు అడు గులు వెయ్యసాగారు.

నేను ఒక్క-క్షణం వెనుకనే ఆగి, 'ఈ రాత్రికి ఇదే ఆఖరి దర్శనం' అన్నట్లుగా ఒక్క-సారి చంచల ముఖంలోకి నవ్వి ముందు వెళుతున్న రఘునందనంగారిని కలుసుకు న్నాను.

గదిలోకి వెళ్లి పడుకున్నానన్న మాటేగాని నాకు నిద్ర పట్టలేదు. చంచల కళ్లే ఆ చీకట్లో నా కళ్లముందు తారట్లాడుతున్నాయి రెండు దీపాల్లా...నేను కళ్లు మూసు

కొని మరింత చీకటిని ఏర్పరుచుకున్నా వాటిల్లో దివ్యత్వం పెరుగుతున్నదే తప్ప తగ్గటంలేదు. నేను ఆ కళ్లనుండి తప్పు కోలేను ... అవి నన్ను వెంటాడుతున్నాయి ... తరుముతు న్నాయి.

నాకు మరో మార్గంలేదు.

ఆ కళ్లల్లో వెలుగు ఉన్నది. దివ్యత్వమున్నది. అమృతమున్నది. వెన్నెలున్నది—దీనత్వమూ ఉన్నది. ఆ కళ్ళను నేను మరువలేను. జీవితంలో ఆ కళ్ళు నా కళ్ళకు జోడైతే నాకు ఇంకేం కావాలి?

నేను ఏ పని మీదైతే ఆ వూరు వచ్చానో అది గూడా నాకు ఆ క్షణంలో గుర్తులేదు. నేను సర్వం మర్చి పోయి 'చంచల' అనే ప్రపంచంలో అనంతవ్యాప్తమయిన వెలుగు నయ్యాను!

ఏలాంటి దిన మిది!

నీటిలో రాయి విసిరినట్లు నా ఆలోచనలను తెంపుతూ తలుపు మ్రోత అయింది. వెళ్ళి తీశాను.

రఘునందనంగారు!

ఆయన నన్ను చూస్తూనే, "నిన్ను ఈ సమయంలో అనవసరపు మాటలతో విసిగించ దలుచుకోలేదు శేషగిరీ! ఒక్కమాట చెప్పు...నీకు చంచలను వివాహం చేసుకోవ టము యిష్టమేనా?" అన్నారు.

ఆయన అంటున్న దేమిటి?...

ఆ ప్రశ్నకు నేను ఉక్కిరి బిక్కిరి అయ్యాను. ఉత్సాహమూ, సంతోషమూ సముద్ర తరంగాల్లా నాలో ఉవ్వెత్తున లేవగా నన్ను నేనే మర్చిపోయాను. ఏమిటిది? కలా? నిజమా?...సామాన్య ఇంజనీరు నయిన నన్ను జమిందారుల హోదాలో ఉన్న రఘునందనంగారు అతిలోక సౌందర్యవతియైన తన కూతురుకు, తన ఆస్తికి సర్వాధికారిణికి, ఒక్క పూట పరిచయంతోనే నా వెనుక ముందులు ఆలోచించకుండానే భర్తగా ఎన్నుకోవటమా?...

నేను విభ్రాంతి జెందాను.

వెలుగు విరజిమ్మే కళ్ళతో, "నేను తగుదునా?" అన్నాను. నా గొంతు తడబడింది.

రఘునందనంగారు అత్యంత ఆహ్లాదాన్ని వ్యక్త పరుస్తూ, నా భుజం తట్టి "నాకు హోదా, ధనమూ కాదు కావాల్సింది శేషగిరీ!...మంచి మనిషి కావాలి! అంతే!" అని చటుక్కున వెనుదిరిగి నా చేయి పట్టుకొని వడివడిగా లాక్కువెళ్ళారు.

ఆయన వెంట నన్ను నేను మరిచి హాల్లోకి వెళ్లాను.

అప్పటికే అక్కడ ఒక బంగారు బొమ్మ నా వంక చూపులు తూపుల్లా గురిపెట్టి నిలబడి ఉన్నది. ఆమె చంచల! కాదు బంగారు బొమ్మ!...

కొన్ని నిముషాల క్రితం చూచిన చంచలకీ, ఇప్పటికీ ఎంతో తేడా ఉన్నది.

తెల్ల చీర బదులు గులాబి చీర, తెల్ల జాకెట్టు, గుండ్రటి బొట్టు స్థానే అర్థ చంద్రాకారంలో తిలకం, బంగారు మెడను కప్పేస్తూ మోయలేనన్ని బంగారు నగలు ...నడుముకు బంగారు వడ్డాణం ... చేతికి కట్టె వంకలు ... ముందుకు వేసుకున్న పొడుగాటి జడలో జడబిళ్ళ, బంగారు కుచ్చులు...

ఆమె నిజంగా...నిజంగా...బంగారు బొమ్మే!

అడుగులు నాకు తెలియకుండానే ముందుకు పడుతున్నాయి. కళ్లల్లో కాంతి దేదీప్యమానంగా వెలుగుతోంది. ఒకవైపు ఏదో అర్థంగానిశక్తి నామీద తడబాటుగా వణుకుతోంది. లేత ఆకుల్లా వణుకుతున్న ఆమె పెదిమల్లాగానే నా పెదిమలూ వణుకుతున్నాయి. అత్యంత బలంగా ఒత్తి ఒత్తి అడుగులు వేస్తూ ఆమె ముందు వెళ్లి నిలబడి కెంపులు కురిపిస్తున్న చంపల్లోకి వెన్నెల కాలవాలమయిన నేత్రాలలోకి రెప్పవాల్చకుండా చూస్తూ శిలయిపోయాను.

ఆమె చిన్నగా నవ్వింది—ఆనందంతో, అందానికి అతిశయంతో.

నేనూ నవ్వాను-ఆమెను పొందబోతున్న గర్వంతో.

మరొక్కడుగు ముందుకువేసి దొండపండ్లలాంటి ఆమె పెదాలను చిన్నగా ముద్దు పెట్టుకోబోయాను.

చేపలా కళ్లు రెప రెప లాడిస్తూ, "నాన్నగారు!" అన్నది కళ్లెత్తి గొణుగుతున్నట్లుగా.

కలవరపడుతూ వెనుదిరిగాను వూహా ప్రపంచంనుండి బయటపడి!

అక్కడెవ్వరూ లేరు!

చంచల ఫక్కున నవ్వింది నన్ను చూస్తూ. ముత్యాలు రాల్చింది. సంపెంగలు వెదజల్లింది. పన్నీరు చిలకరించింది.

చటుక్కున నా చేయి పట్టుకొని "అంత తొందర కూడదు!" అన్నట్లుగా తల తిప్పుతూ ముక్కుమీద వేలేసుకుంది.

చిన్నగా నా ముందు నడుస్తున్న ఆమెను అడుగులో అడుగు వేసుకుంటూ అనుసరించాను. ముందుగావున్న నా గదిలోకి దారితీసి నేను గదిలో కాలు పెట్టగానే, ఆమె వెనుదిరిగి గడప దాటింది.

"హాయిగా నిద్రపోండి! గుడ్ నైట్!" అని తలుపులు మూసి ఒక్కక్షణం కూడా ఆగకుండా వెళ్ళిపోయింది వడివడిగా.

లిప్తకాలం నన్నెవరో హిమాలయాల మీదనుండి క్రిందకు త్రోసినట్లనిపించింది. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి మంచంమీద నడుం వాల్చాను.

బుర్రలో లక్ష ప్రశ్నలు, లక్ష ఆశలు, లక్ష కోరికలు, లక్ష ఆలోచనలు—ఉక్కిరి బిక్కిరి అయ్యాను.

నేను రేపు చెయ్యవల్సిన ఉద్యోగ విధి నిర్వహణ మీదగాదు—చంచలమీద!

తరువాత ఎప్పుడు నిద్ర పట్టిందో నాకు తెలియదు!

సూర్యుడు కళ్ళలోకి సూదులతో పొడుస్తుండగా ఎవరో హడావుడిగా నన్ను ఊపుతూ నిద్ర లేపగా ఉలిక్కిపడి లేచాను—చంచలే అయిఉంటుందనుకుంటూ!

కాదు—ఎవరో క్రొత్త వ్యక్తి!
"ఎవరూ?" అంటూ తలెత్తాను.

ఎందుకో ఒళ్ళంతా నెప్పులుగా ఉంది. తలపోటు పుడుతోంది. శరీరానికి ఏవో గట్టిగా పొత్తుకుంటున్నాయి. బూజర బూజరగా ఉన్న కళ్ళను రెండు చేతులతో తుడుచుకుంటూ మరింత తీక్షణంగా చూచాను.

ఏఁవిటిది?

నిజమా?

నాకు కళ్ళు తిరిగినయి. సర్వం అయోమయమయింది. నే నెక్కడున్నాను? బూజుపట్టి. గబ్బిళాలు ఎగురుతూ, కంపు గొడుతున్న, నల్లటి విరిగిన గోడల నడుమ... రాళ్ళలో దుమ్ములో ధూళిలో...కటిక నేలమీద...

భయంతో గుండె ఆగినంత పనయింది.

రాత్రి...రాత్రి...నేను గడిపినది...???
భగవాన్!

ఒక్క ఉదుటున బయటకు దూకి, అక్కడ ఉన్న ఇద్దరు ముగ్గురు వ్యక్తులను గూడా తప్పించుకొని గేటు దాటి రోడ్డుమీద నిలబడ్డాను!

వెనుదిరిగి చూస్తే ఏం(వున్నది ?

ఊరికి కొన్ని ఫర్లాంగులదూరంలో కొన్ని దశాబ్దాల నుండీ ఉపయోగించని, కూలిపోయేందుకు సిద్ధంగా పాత రెండంతస్థుల మేడ...అక్కడక్కడా విరిగి పడిపోయిన కాంపౌండ్ వాల్...చదలు పట్టిన గేట్లు...అర్థం పర్థంగాని గిసెట్టే చెట్లతో నిండిన ఆవరణ!

రాత్రంతా గడిపింది ఈ బంగళాలోనా ?

కళ్ళు గిర్రున తిరిగినయ్.

నన్ను నిద్రలేపిన ఆ వ్యక్తులు బయటకొచ్చారు.

కాస్త సంశయిస్తూ అడుగు ముందుకువేసి అడిగాను, "మీా రెవరు ?"

అందులో ఒక వ్యక్తి "వీరు ఈ వూరు కరణం గారు!" అన్నాడు.

వయస్సు మళ్లిన కరణంగారు చిన్నగా నాకు దగ్గరగా వచ్చి నా భుజంమీాద తడుతూ "గాభరా పడబోకండి! ఇంటికి వెళ్దాం పదండి!" అన్నారు.

ఎండాకాలమవటంతో ఎనిమిది గంటలకే ఎండ తీక్షణరూపం దాల్చింది. గాలి తన శక్తిని చూపిస్తూనే ఉన్నది.

తలవంచి ఒక్కసారి నన్ను నేను చూచుకున్నాను - లాగూ చొక్కా మట్టిపట్టి తోళ్ళయినయి. అక్కడక్కడా చిరుగులు కూడా నన్ను హేళన చేస్తూ కనబడుతున్నయి.

ఇంకా నాకు గుండె దడ తగ్గలేదు. ఎగిరెగిరిపడే ఉచ్ఛ్వాస నిశ్వాసాలే అందుకు నిదర్శనం. అటు కాళ్ళు చేతులు గూడా రాత్రి సంఘటనలను గుర్తుకు తెస్తూ వణుకుతున్న మాటా వాస్తవమే.

బెదురుతున్న కళ్ళతో ఆ పడిపోతున్న పాతకొంపను చూస్తున్న నేను, 'పదండి' అన్న కరణంగారిని చిన్నగా అనుసరిస్తూ అడుగు వేయసాగాను.

"పొద్దున స్టేషన్ మాష్టరుగారు పంపిన పెట్టె బెడ్డింగ్‌ను చూచి ఆశ్చర్యపోయాను..." కరణంగారు చెప్పసాగారు. "వాడా మీరు రాత్రే బయల్దేరి మా ఇంటికి వచ్చారని చెబుతున్నాడు! వాడి మాటలు ఎట్లా కాదనేది...నాకేం పాలు పోలేదు...స్టేషన్ మాష్టర్‌తో మా ఇంటికి అని చెప్పి బయల్దేరిన మీ రెక్కడకు వెళతారు... అందునా మీ కింకెవరెలా తెలుసని వెళతారు... ఆలోచించాను... చటుక్కుని ఈ బంగళా సంగతి స్ఫురణ కొచ్చింది...ఇంతకు క్రితం గూడా ఒకటి రెండు సంఘటనలు ఈలాంటివి జరిగినయ్...వెంటనే ఆలస్యం చేయకుండా మా ఇద్దరు పాలేర్లను వెంట బెట్టుకొని ఇలా వచ్చాను!"

ఆయన చెబుతున్న దేవిటో నాకర్థం గాలేదు. ఇంకా చంచల కళ్ళే నా ముందు తారట్లాడుతున్నాయి. రఘునందనంగారి నిక్కబొడుచుకున్న తెల్లటి జుట్టే నన్ను నిక్కి నిక్కి చూస్తోంది.

మొఖాన బట్టిన చమటను చేతులతో తుడుచుకుంటూ కరణంగారిని అడిగాను. "ఆ బంళాను గురించి నాకు చెబుతారా? ఎందుకలా అయింది...దాని వెనుక కథ ఏమిటి?...అసలు దయ్యాలంటేనే నమ్మకంలేని నాకు ఇది జీవితంలో మరువలేని సంఘటనే...నా భావాలకు గొడ్డలి పెట్టు!"

"అది ఒక కథ శేషగిరిగారూ! పదిహేను సంవత్సరాల క్రితం జరిగిన కథ..."

"మీరు టూకీగా చెప్పినా నేను అర్థం చేసుకోగలను... ఎలాగంటారేమో... మీకు జీవించి ఉండగా ఆ వ్యక్తులతో పరిచయం ఎలా కలిగిందో...నాకూ వాళ్ళతో ఆలాగే పరిచయం కలిగింది...అయితే చచ్చిపోయిన తరువాత అనుకోండి!" అని చిన్నగా నవ్వి, "ఇద్దరూ చచ్చిపోయారని ఎందుకు అంత గట్టిగా చెబుతున్నానంటే— అందులో ఎవరు బ్రతికిఉన్నా ఆ కొంప ప్రస్తుతం అలాంటి స్థితిలో ఉండేదిగాదు— అందునా నగ్న సత్యంలాంటిది మరోటి గూడా ఉన్నది—మనుష్యులు చస్తేగాని దయ్యాలవ్వరనేది!" ఈసారి కాస్త గట్టిగానే నవ్వాను.

"...ఆయనది ఏ వూరో ఎక్కడనుండి వచ్చారో నాకైతే తెలియదు. ఆయన చెప్పలేదు గూడా. కాని పదిహేను సంవత్సరాల క్రితం గాబోలు ఎనిమిది సంవత్సరాల కూతురితో ఈ వూళ్లో కాలు పెట్టారు. ఆ రోజుల్లోనే ఒక్క

సంవత్సరంల్లోగా అత్యంత అధునాతనంగా ఈ బంగళాను కట్టించారు...నేను ఈ వూరి కరణాన్ని కాబట్టి సహజం గానే ఆయనతో నాకు పరిచయం ఏర్పడింది. మాటల సందర్భంలో ఆయన చెప్పినదాన్ని బట్టి నేను అర్థం చేసుకో గలిగింది ఏమిటయ్యా అంటే—ఆయనది, ఆయన భార్యది ఒక కులం గాదని, అందువలన కులం వాళ్ళంతా తమని వెలి వేశారని, ఇంతలోనే భార్య కాస్తా అకస్మాత్తుగా మరణించిందని, ఆ బంధువుల సూటిపోటి మాటలనుండి, గతించిన భార్య స్మృతులనుండి తప్పుకునేందుకుగాను, ఆ భార్యవలన కలిగిన ఒక్కగా నొక్క కూతురును తీసు కొని ఇన్నివందల మైళ్ళ దూరం వచ్చేశాడని—ఆయన మాటలు వింటే నాకు జాలి వేసింది. ఆయన మాటల్లో తరచు కళ్ళవెంట నీరు తిరుగుతుండేది...ఎంత బాధతో ఇక్కడకు వచ్చాడో అనుకునేవాడిని—అవన్నీ మర్చిపోయి మనస్థిమితం పొందాలని ఇక్కడకు వచ్చాడుగాని...పాపం! ...విధి లిఖితం ఎవరు తప్పించగలరు?''

''ఏమైంది?'' ముందుకు వంగి ఆసక్తిగా అడిగాను.

''ఈ వూరు వచ్చిన సంవత్సరం లోగానే అను కుంటాను... నాకు బాగా గుర్తుంది ఆ రోజు... ఆ రోజు కూతురు పుట్టిన రోజు పండుగట...వూరి పెద్దలమైన మమ్మల్ని కొందరిని విందుకు ఆహ్వానించారు...అయితే విందు జరగకుండానే ఆ ఇంటి వెలుగు ఆరిపోయింది...ఆ రోజే

అది చీకటి కొంపగా మారిపోయింది...ఎన్నో వూహాలతో వచ్చిన ఆయనకు ఆ రోజుతో సర్వం చీకటయింది...అంతకు క్రితం రోజువున్న వెలుగు తరువాత ఎన్నడూ ఆ గృహంలో నేను చూడలేదు...!''

ఆయన చెప్పుకు పోతూనే ఉన్నారు.

''ఆయనేగాదు ఎవరైనా అలాగే అయి ఉండేవారు ...జరిగిన దుర్ఘటన చెబుతాను వినండి!...ఆ రోజు ఆ అమ్మాయి జన్మదినం అన్నానుగదూ? ఉదయాన లేస్తూనే పని మనిషి తలంటిపోసింది...క్రొత్త గుడ్డలు కట్టింది... ఆయనే స్వయంగా అద్దాల బీరువా తెరిచి బంగారు ఆభరణాలున్న పెట్టె బయటకు తీశారు...అవన్నీ శ్రద్ధగా ఒక్కొక్కటీ అమ్మాయికి అలంకరించసాగారు. నేను చూచాను గూడా ఆ అమ్మాయిని...పచ్చటి శరీరంమీద ఆ సొమ్ములు ధగ ధగా మెరిసిపోతున్నాయి. మెడ కనబడ కుండా నగలు వేశారు...చేతికి కట్టె వంకీలు...నడుముకు వడ్డాణం...''

''ఇంతకీ ఏమైందో చెప్పనేలేదు...?'' అడిగాను ఆదుర్దాగా ఆలస్యాన్ని భరించలేక.

''తరువాత ఏముంది...అన్ని సొమ్ములు పెట్టుకొని అత్యంత ఉత్సాహంతో ఆడుకుంటున్న ఆ అమ్మాయి మాయమయింది. ఎవ్వరికీ కనబడలేదు. ఆ రోజుకు ఈ రోజుకు అది విచిత్రంగానే ఉండి పోయింది. మొదట్లో—

ఆ సొమ్ముల కాశపడి ఎవరో ఆ అమ్మాయిని ఎత్తుకెళ్ళి ఉంటారని అనుకున్నాం—కాని సొమ్ములు పోతేపోయినయి ఏనాటికైనా ఆ అమ్మాయి తిరిగి రావాలిగదా?...ఇంత వరకూ లేదు...ఆ సొమ్ముల కోసరం ఎత్తుకు వెళ్ళినవాడే చంపి ఆ పిల్లను ఎక్కడో పారవేశాడనుకున్నా—శవం గూడా ఎంత ప్రయత్నించినా ఆచోకీ దొరకలేదు... తరువాత ఆరు నెలలకే అనుకుంటాను. ఆ దిగులుతోనే ఆయనా కన్ను మూశారు...అంతే! ఆ భవనం గతి అలా అయింది!'' ఒక నిట్టూర్పు విడిచాడు ఆయన

''ఆయన పేరు?'' ఆసక్తిగా అడిగాను.

''రఘునందనంగారు!''

''ఆ అమ్మాయి పేరూ?''

''చంచల!''

''చంచలా?'' పిచ్చిగా గొణిగాను!

ఇట్లు,
శేషగిరి

పదునైదు రోజుల తరువాత క్యాంపునుండి తిరిగి ఇంటికి వచ్చిన నాకు రుక్మిణి ఇచ్చిన లావుపాటి కవరులో విషయం అది!

నేను ఆశ్చర్యపోయాను.

ఒక విధంగా నవ్వూ గూడా వచ్చింది—దయ్యాలు లేవు అని వాదించే శేషగిరికి ఇది నిజంగా పరాజయమే—

కాని జరిగింది దాచి పెట్టకుండా నాకు వెంటనే జాబు వ్రాసి నందుకు (వాడు వోడిపోయినా!) వాడిని మెచ్చుకోకుండా వుండలేను.

శాస్త్ర ఎగతాళి మిళితంచేసి వాడికి వెంటనే ఉత్తరం వ్రాద్దామని ఆ మధ్యాహ్నం అనుకుంటుండగానే 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ'లో నా పేరన ఒక కవరు వచ్చింది.

అది వ్రాసింది శేషగిరే!

అంత అర్జంటు విషయం ఏవిటా అని ఆశ్చర్యపోతూ త్వరత్వరగా చించాను.

"అరేయ్! పిచ్చి సన్యాసీ!...

మరో ఘోరం కూడా నా కంట పడింది నాన్నా!

అబ్బాయి! ముందు గుర్తుంచుకో...ఇది క్రితంసారి నీకు వ్రాసిన జాబుకు తరువాయి భాగం అని!...

ఊరి మొదట్లో కరణంగారు నా కోసం నిర్ణయించిన గృహం అన్ని విధాలా అనుకూలంగా ఉండటంతో మా జనరల్ మేనేజర్ కోరినట్లుగా 'టెలిగ్రాం' ఇచ్చాను. దానికి సమాధానంగా మూడు రోజులకు ఆఫీసు పర్సోనల్‌తో సహా జూనియర్ ఇంజనీర్లు మొదలయిన వాళ్ళంతా ఇక్కడకు వచ్చేశారు.

నాకు తెలిసిన ఒక విచిత్ర మేమిటంటే—నన్ను ఇంతగా కలచివేసిన ఆ దయ్యాల కొంపకూడా ఈ కంపెనీ కొంటంటున్న స్థలంలో ఒక భాగమని!...కంపెనీ ప్లాను ప్రకారం

ఆ ఇంటిని పూర్తిగా పడగొట్టించాలి...ఎందుకంటే సరిగ్గా అది అన్నిటికీ అడ్డంగా మా ఫ్యాక్టరీ మధ్యలో కొచ్చింది... దానివలన తప్పలేదు!

నాకు ఎందుకో ఆ మేడను పడగొట్టాలంటే మనస్సు బాధ జెందింది. మాటి మాటికి రఘునందనంగారు, చంచల గుర్తుకు రాసాగారు...వారి చివరి ఆశలకు చిహ్నమైన (వారు ఫలితం పొందకపోవచ్చు!) దానిని తుద ముట్టించాలంటే నాకు కాస్త కష్టంగానే ఉన్నది...కానీ ఏం చేయగలను?...అధికారుల నిర్ణయాన్ని తు. చ. తప్పకుండా నా భావాలెలా ఉన్నా, ఆచరించటమే నా విధి!

అందునా—నేల చదునుచేయించే ముందుగానే ఆ మేడను పడగొట్టాలని నిర్ణయించారు!

గుబురుగా, భయంకరంగా ఎన్నో సంవత్సరాలబట్టి ఆ మేడను అంటిపెట్టుకొని ఉన్న చెట్లను, పెచ్చులురాలుతూ పడిపోయేందుకు సిద్ధంగావున్న గోడలను ముక్కలు చేసేందుకుగాను వందమంది కూలీలకు నాలుగు రోజులు పట్టింది.

రాళ్లు సున్నం తీసుకువెళ్ళి దూరంగావున్న గుంటల్లో పోశారు. కొట్టిన చెట్లను వేలం వెయ్యగా వంద రూపాయల దాకా కంపెనీకి ఆదాయం వచ్చింది.

ఇక నేలమీద ఒక అడుగు ఎత్తునవున్న ఆ ఇంటి పౌండేషను తీయించాలి...

నిన్న ఉదయం దానిని కూడా చదును చేయిద్దామనే స్థిర సంకల్పంతో అక్కడ తిరుగుతుంటే—అకస్మా

త్తుగా నా దృష్టి ఒక చెక్క పలకమీద పడింది. అక్కడ నేలలో ఒక గది ఉన్నట్లనిపించింది.

కూలీలను పిలిపించి ఆ బిగుసుకుపోయిన తలుపులను బలవంతాన లాగించాను...పై భాగమంతా కూడా చిన్నగా, జాగ్రత్తగా, లోపలకు బాగా వెలుగు పడేంత వరకు పగల గొట్టించాను.

లోపలికి చూస్తూనే నేను కొయ్యబారిపోయాను!

నా ఆశ్చర్యానికి అవధులు లేవు...

నా కళ్ళను నేను నమ్మలేకపోయాను...

లోపల ఒక ఎముకల గూడు మనిషి ఆకారంలో పేర్చబడి ఉన్నది!

దాని మెడనిండా బంగారు సొమ్ములు...చేతి భాగంలో కట్టి వంకీలు...తళతళా మెరిసే గుడ్డలమీద (అక్కడక్కడా చిరిగిన) నడుముండవల్సిన స్థలంలో బంగారు వడ్డాణం...

ఇక నేను వ్రాయలేనురా కన్నా...!

ఇట్లు

శేషగిరి."

---